క్లుప్తంగా

సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్‌గా రవిబాబు



కలెక్టర్ గౌతమ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్ రవిబాబు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్‌గా ఎం.రవిబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మేనేజర్ మైసా శ్రీనివాసరావు, ఉద్యోగులు, కాంగ్రెస్ నాయకులు ఎండి కమల్‌పాషా కలిసి అభినందనలు తెలిపారు. ముందుగా కలెక్టర్ వీపీ గౌతమ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

కలెక్టర్‌ను కలిసిన వైరా కమిషనర్..



కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్ వేణు

వైరా: వైరా మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సీహెచ్ వేణు గురువారం జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్‌ను నూతన కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ ఆయనకు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



అమృత, అశ్విత‌

మధిర: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఖమ్మం జిల్లా మధిరకు చెందిన శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల అధినేత బి.అంజన్ బాబు తెలిపారు. రాష్ట్రస్థాయి కబడ్డీ సబ్ జూనియర్ పోటీల్లో ఆడేందుకు ఖమ్మం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కబడ్డీ సబ్ జూనియర్ టీంను ఎంపిక చేశారు. ఈ టీంలో మధిరకు చెందిన శ్రీనిధి విద్యార్థులు వి.అమృత, డి.అశ్విత రాష్ట్రస్థాయికి ఎంపిక కాగా.. వారిని డైరెక్టర్ చందు, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రవీణ్, ఉపాధ్యాయులు అభినందించారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

చింతకాని: గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులు రూ.1.87 కోట్లు మంజూరైనట్లు ఎంపీపీ కోపూరి పూర్ణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో మండలంలోని 25 గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలను చేపట్టనున్నట్లు తెలిపారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

వైరా: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సాయంగా సహాయ సహకారాలు అందించడానికి లయన్స్‌క్లబ్ ఎల్లవేళలా ముందుంటుందని లయన్స్‌క్లబ్ పాస్ట్ గవర్నర్ జనరల్ డాక్టర్ కాపా మురళీ కృష్ణ అన్నారు. వైరాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు దొడ్డా వరప్రసాద్ విన్నపం మేరకు లయన్ రాయపూడి వెంకటేష్ తన తండ్రి బల రామకృష్ణమూర్తి జ్ఞాపకార్థం రూ.10 వేలు విలువ చేసే మైక్‌సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం వెంకటేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మాధవరావు, ఉపాధ్యాయులు వరప్రసాద్, భాస్కరరావు, వెంకటేశ్వరరావు, షఫీ, రామకృష్ణ, సీతారామారావు, నరసింహారావు, పద్మావతి పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్..

పెనుబల్లి: బోనెబోయిన చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దివ్యాంగుడికి గురువారం ట్రై సైకిల్ వితరణగా అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా, నూతిపాడు గ్రామానికి చెందిన గమాసు ఏసోబు పుట్టుకతోనే రెండు కాళ్లు పనిచేయడం లేదు. ఆయనను తన తల్లి కూలీ పనులు చేసి జీవనం సాగిస్తున్నారు. విషయం తెలుసుకున్న బోనెబోయిన చారిటబుల్ ట్రస్టు నిర్వాహకురాలు అన్నపూర్ణ గురువారం పెనుబల్లిలో తన షాపు వద్ద దివ్యాంగుడికి రూ.10 వేలు విలువగల ట్రై సైకిల్‌ను వితరణగా అందజేశారు.

అంగన్‌వాడీల్లో అక్షరాభ్యాసం

ఎర్రుపాలెం: మండలంలోని గుంటుపల్లిగోపవరం గ్రామంలో శుక్రవారం అంగన్‌వాడీకేంద్రంలో పలువురి చిన్నారులకు స్థానిక అంగన్‌వాడీ టీచర్ మందడపు రాజేశ్వరి సామూహిక అక్షరాభ్యాసం చేశారు. భవిష్యత్‌లో బాగా చదువుకుని ఉన్నత స్థానంలోకి చేరుకోవాలని ఆమె ఆశీర్వదించారు. చిన్నారులకు పలకలు, బలపాలు, పుస్తకాలు పంపిణీ చేశారు.

సబ్ వే నిర్మిస్తేనే మేలు

రైల్వేట్రాక్ వద్ద మెట్లతో కూడిన అండర్ బ్రిడ్జి నిర్మించాలి

- అండర్ పాస్ నిర్మిస్తారనే ప్రచారంతో ఆందోళన
- అదే జరిగితే పలు రహదారులు మూతపడే ప్రమాదం
- ఇళ్లు కోల్పోనున్న వందలాది మంది ప్రజలు



స్టెప్ అండర్ బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రదేశం ఇదే..



రైల్వే ట్రాక్ దాటుతున్న ప్రజలు

మధిర: మధిర పట్టణంలో ఉన్న రైల్వేగేట్ వద్ద మెట్లతో కూడిన అండర్ బ్రిడ్జి(సబ్ వే)ని నిర్మించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న రైల్వేలైన్ పట్టణంలో రెండుగా విభజిస్తూ ఉండడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రమైన మధిరకు నిత్యం వేలాదిమంది ప్రజలు వచ్చి వెళ్తుంటారు. ప్రజలు తప్పని పరిస్థితుల్లో ఈ రైల్వేలైన్ దాటడం ఆనవాయితీగా మారింది. అయితే, గేట్ మీదుగా ప్రయాణానికి వీలు లేకుండా పూర్తిగా మూసివేయడంతో వృద్ధులు, మహిళలు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే రైల్వేగేట్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జిపై మెట్లు నిర్మించినా ఎక్కిదిగలేక అవస్థలు ఎదురవుతున్నాయి. ఫలితంగా రైల్వే ట్రాక్ దాటడం ప్రమాదకరమని తెలిసినా మరో మార్గం లేక అదే దారి ఎంచుకుంటున్నారు. రైల్వే లైన్‌కు ఇరువైపులా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, రైల్వే, బస్‌స్టేషన్లు, పాఠశాలలు, కళాశాలలు, వైద్యశాలలు, వ్యాపార సముదాయాలు ఉంటాయి.

అండర్ పాస్ నిర్మాణంపై ప్రచారం..

ప్రస్తుతం మూసివేసిన రైల్వే గేట్ ప్రాంతంలో మెట్లతో కూడిన అండర్ బ్రిడ్జి నిర్మించకుండా రైల్వే అండర్ పాస్ నిర్మాణం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలియడంతో ప్రజల్లో ఆందోళన చెందుతున్నారు. అండర్ పాస్ నిర్మాణం ఎక్కువ దూరంతో నిర్మించడం వల్ల రైల్వేగేటుకు ఇరువైపులా ఉన్న పలు రోడ్లు నామరూపాలు లేకుండా పోతాయి. అండర్ పాస్ నిర్మిస్తే పట్టణంలోని వన్ టౌన్ వైపు ఉన్న మెయిన్ రోడ్డు, లడకబజార్, ఎంపీడీవో కార్యాలయం, రైల్వేస్టేషన్ రోడ్లు మూసుకుపోతాయి. అదేవిధంగా పట్టణంలోని టూ టౌన్ వైపు వైరా రోడ్డుతో పాటు ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, లడక బజారుకు వెళ్లే రోడ్డు కూడా మూతపడతాయి. ఈమేరకు పాత రైల్వేగేట్ వద్ద అండర్ పాస్ కాకుండా తక్కువ స్థలంలో స్టెప్స్ అండర్ బ్రిడ్జి (సబ్ వే) నిర్మించాలని కోరుతున్నారు. ఒకవేళ అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాల్సి వస్తే రైల్వే అండర్ బ్రిడ్జి పక్కన లేక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో లేదా విజయవాడ రోడ్డులోని మార్కెట్ యార్డ్ ఏరియా ప్రాంతంలో ఉన్న రైల్వే లైన్ వద్ద నిర్మించాలని కోరుతున్నారు. కాగా, లడక బజారు ప్రాంతంలో అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని ఆర్ అండ్ బీ అధికారులు సర్వే చేయడంతో ఆ ప్రాంత ప్రజలు తమ ఇళ్లు తొలగిస్తారని ఆందోళన చెందుతున్నారు. మెయిన్ రోడ్డు నుంచి వెళ్లేందుకు పట్టణ నడిబొడ్డున ఉన్న రైల్వే గేట్ వద్ద స్టెప్ అండర్ బ్రిడ్జి లేదా రైల్వే అండర్ పాస్ నిర్మించకుండా సుదూర ప్రాంతంలో ఇటువంటి నిర్మాణాలు చేపట్టడం వల్ల ఉపయోగం ఏమిటనే చర్చ నడుస్తుంది. ఈమేరకు ఏ నిర్మాణం చేపట్టినా పాత రైల్వే గేట్ వద్దనే చేపట్టాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఈ సమస్యపై ప్రజలు ఇటీవల ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో మధిరలో జరిగిన గ్రీవెన్స్ డేలో కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు.

స్టెప్ అండర్ బ్రిడ్జి నిర్మించాలి..



మూసివేసిన రైల్వే గేట్ వద్ద స్టెప్ అండర్ బ్రిడ్జి నిర్మించాలి. తద్వారా కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, ప్రజలకు అసౌకర్యం ఉండదు. అలాకాక అండర్ పాస్ నిర్మిస్తే పలు రోడ్లు మూసుకుపోయి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతుంది.

– మిర్యాల కాశీ విశ్వేశ్వరరావు, వ్యాపారి, మధిర

ఇళ్లు తొలగిస్తే ఉద్యమిస్తాం..



దశాబ్దాలుగా నివసిస్తున్న ఇళ్లను తొలగిస్తే ఉద్యమిస్తాం. అవకాశం ఉన్నచోట స్టెప్ అండర్ బ్రిడ్జి కానీ రైల్వే అండర్ పాస్ కానీ నిర్మించాలి. కానీజనావాసాలను తొలగించి నిర్మాణాలను చేపడతామంటే ఊరుకోం. డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి పోరాడుతాం.

– భీమని గాంధీ, లడక బజార్, మధిర

దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోండి



జేవీఆర్ ఓసీలోని సీహెచ్‌పీని పరిశీలిస్తున్న జీఎం షాలేం రాజు

సత్తుపల్లిరూరల్: జేవీఆర్ ఓసీ సీహెచ్‌పీని సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలేంరాజు జేవీఆర్ ఓసీ సీహెచ్‌పీ ఇన్‌చార్జ్ కె.సోమశేఖర్‌రావుతో కలిసి గురువారం సందర్శించారు. కోల్ రేకులు లోడింగ్ అవుతున్నప్పుడు కోల్‌స్టోరేజ్ బంకర్ల నుంచి బొగ్గు సైలో బంకర్‌లకు వెళ్లేటప్పుడు దుమ్ము లేవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వారంరోజుల్లోగా.. వాటర్ మిస్ట్ కెనాల్‌లను, వాటర్ మిస్ట్ స్ప్రేసిస్టంలను పెట్టవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం చుట్టూ ఉన్న పరిసరాలను జనరల్ మేనేజర్ షాలేం రాజు సందర్శించారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా ఎస్‌ఓ టూ జీఎం జీవీ కోటిరెడ్డి, ఏరియా ఇంజనీర్ దుర్గాప్రసాద్, కిష్టారం పీఓ ఎంవీ నర్సింహారావు, రాకేష్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి సర్వే



సర్వే చేస్తున్న పంచాయతీరాజ్ శాఖ అధికారులు

చింతకాని: మండలంలోని గాంధీనగర్‌కాలనీ గ్రామం నుంచి చినమండవతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పోలంపల్లి వరకు ఉన్నటువంటి డొంక రహదారుల్లో బీటీ నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ అధికారులు గురువారం సర్వే నిర్వహించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు గాంధీనగర్‌కాలనీ నుంచి పందిళ్లపల్లి, జగన్నాథపురం, మత్కేపల్లి, తిరుమలాపురం, తిమ్మినేనిపాలెం, చినమండవ గ్రామాల ద్వారా పోలంపల్లి వరకు బీటీ రహదారి నిర్మాణానికై సర్వే చేయటం జరుగుతుందని పంచాయతీరాజ్ శాఖాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ కోటేశ్వరరావు, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి వినియోగదారుల గుర్తింపు

మధిర: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న గృహజ్యోతి పథకం క్రింద 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే లబ్ధిదారులను గుర్తింపు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుందని మధిర విద్యుత్ శాఖ ఏడీఈ అనురాధ తెలిపారు. గురువారం స్థానిక విద్యుత్ శాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. విద్యుత్‌శాఖ సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు కానీ, విద్యుత్ కార్యాలయంలో కానీ తమ ఆధారాలు చూపించి ఈ నెల 17 లోగా ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

తల్లాడ: రైతులు పీఎం కిసాన్ పథకం వివరాలిచ్చిన తమ బ్యాంకు ఖాతాకు ఆధార్‌కార్డు అనుసంధానం చేయించుకోవాలని సత్తుపల్లి వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు యు.నరసింహారావు అన్నారు. తల్లాడ, పరిసర గ్రామాల్లో గురువారం వ్యవసాయ శాఖా సిబ్బంది ఈకేవైసీ, ఆధార్ అనుసంధానంపై అవగాహన కల్పించారు. మండలంలో 231 మంది ఈకేవైసీ, 248 మంది రైతులు ఆధార్ అనుసంధానం చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎండి.తాజుద్దీన్, ఏఈఓలు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి



కారేపల్లి: మాట్లాడుతున్న ఎస్సై రామారావు



ముదిగొండ: మండల పరిషత్ కార్యాలయంలో సేవాలాల్ చిత్రపటానికి నివాళి..



వేంసూరు: చౌడవరం తండాలో..

కారేపల్లి/ ముదిగొండ/ వేంసూరు: బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు గురువారం ఆయా మండలాల్లో ఘనంగా జరుపుకున్నారు. కారేపల్లిలో లంబాడ సంక్షేమ సంస్కృతి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎస్సై రామారావు పాల్గొన్నారు. అదే విధంగా ముదిగొండలోని మండల పరిషత్ కార్యాలయంలో.. తహసీల్దార్ రామారావు, విద్యుత్‌శాఖ ఏడీఈ భీమ్ సింగ్, ఏఈ నారాయణ పాల్గొనగా.. వేంసూరులోని చౌడవరం తండాలో తహసీల్దార్ ఎంఏ రాజు, ఎంపీఓ రంజిత్ కుమార్ లు పాల్గొని సంత్ సేవాలాల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేలోతు రాములు నాయక్, జెడ్పీటీసీ జగన్‌నాయక్, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, సంతగుడి చైర్మన్ అడ్డగోడ ఐలయ్య, ఎస్టీసెల్ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, తిరుపతిరావు, హేమ్లానాయక్, నరేష్, బాలునాయక్, వీరూనాయక్, సురేందర్ మనియార్, శంకర్, లక్ష్మణ్, బిచ్యానాయక్, సీహెచ్‌ఓ భద్రయ్య, ఎంపీఓ సూర్యనారాయణ, ఉపాధ్యాయులు మల్లా, రాములు, రామకృష్ణ, లక్ష్మణ్, రాంమోహన్, సురేష్, మాజీ ఎంపీటీసీ నాగులు, మాజీ జెడ్పీటీసీ భాషానాయక్, మాజీ సర్పంచ్ నాను, లాలు, రామచంద్రనాయక్, గోపి లచ్చిరాం, తదితర నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

తల్లాడ: మండలంలోని నూతనకల్, మిట్టపల్లి గ్రామాల్లో గర్భిణులకు గురువారం తల్లాడ ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి రత్న మనోహర్ మాట్లాడుతూ.. గర్భిణులు గర్భస్థ సమయంలో నాలుగుసార్లు వైద్యులచే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. పోషకాహారం తీసుకోవడం వల్ల తల్లి బిడ్డలకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు రావని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్ వైజర్ పెద్ద పుల్లయ్య, భాస్కర్, మేరమ్మ, భద్రమ్మ, రాజశ్రీ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

రేణుకా చౌదరికి సన్మానం



రేణుకా చౌదరిని సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వైరా: రాజ్యసభ సభ్యురాలిగా నామినేషన్ వేసిన మాజీ కేంద్ర మంత్రి జి.రేణుకా చౌదరిని హైదరాబాద్‌లో ఆమె నివాసంలో కలిసిన టీపీసీసీ కార్యదర్శి ఎలక్షన్ క్యాంపెయిన్ కమిటీ కో కన్వీనర్ కట్ల రంగారావు తన మిత్ర బృందంతో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, సంతోష్, నాగరాజు, నాగేశ్వరరావు, ఐఎన్‌టీయూసీ నాయకులు నాగరాజు, వీరబాబు, సాయి, మోసిన్, కాంతయ్య, భాస్కర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మిస్ట్ కళాశాలలో వర్క్‌షాప్



అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్ సాయిచరణ్

సత్తుపల్లిరూరల్: కాలానుగుణంగా మారుతున్న ఆధునిక సాంకేతికతను ఇంజనీరింగ్ విద్యార్థులు అభివృద్ధి చేసుకోవాలని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ అన్నారు. కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన బీటెక్, ఎంటెక్ విద్యార్థులకు మూడురోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ వర్క్‌షాప్‌లో రిసోర్స్ పర్సన్‌గా హైద్రాబాద్‌కు చెందిన డిజైన్ ల్యాబ్స్ సాయిచరణ్ వ్యవహరించారు. ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎల్ఎస్ సాయిఇంద్రసేనారెడ్డి, కన్వీనర్ కె.రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కారేపల్లి: రైతు పోరాటంపై కేంద్ర ప్రభుత్వ నిర్బంధాలను ఆపాలని డిమాండ్ చేస్తూ.. గురువారం కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, సీపీఎం, సీపీఐ, ఎన్డీ నాయకులు పాల్గొన్నారు.

సింగరేణితో ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించండి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: అభివృద్ధికి చిరునామాగా ఉండాల్సిన సత్తుపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పాలనలో కుంటుపడిందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. అసెంబ్లీలో గురువారం తొలిసారి మాట్లాడిన ఆమె సింగరేణి బొగ్గు తవ్వకాలతో ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావించారు. బాధిత కుటుంబాలు, బాధితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ సక్రమంగా అమలు కాలేదని, ఇంటికో ఉద్యోగం రాకపోగా, సింగరేణి నిధులను సత్తుపల్లి నియోజకవర్గానికి కాకుండా ఇతర ప్రాంతాలకు తరలించారని తెలిపారు. ఇకనైనా సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించడమేకాక కిష్టారంలో లోడింగ్ పాయింట్ వల్ల అంబేద్కర్ నగర్ కాలనీలోఇబ్బంది పడుతున్న 300 కుటుంబాల తరలింపుపై సింగరేణి సంస్థతో చర్చించాలన్నారు. అలాగే, సింగరేణి ఆధారిత చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటు, సూపర్‌స్పెషాలటీ ఆస్పత్రి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం..

సింగరేణి ప్రభావిత కిష్టారంలో ఎదురవుతున్న ఇబ్బందులను అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే రాగమయి చిత్రపటానికి అంబేద్కర్‌నగర్ వాసులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు అప్పారావు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పంచాయతీలను తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దే..



మాజీ సర్పంచ్‌లను సన్మానిస్తున్న సండ్ర

వేంసూరు: దేశంలోనే గ్రామ పంచాయతీలను ఆదర్శంగా నిలిపి ఉత్తమ అవార్డులు సాధించేలా చేసిన ఘనత బీఆర్ఎస్, మాజీ సీఎం కేసీఆర్‌దేనని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. మండలంలోని వెంకటపురంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్‌లను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై పోరాటం చేసేందుకే మనకు ప్రతిపక్షహోదా ఇచ్చారని ప్రతి ఒక్కరికీ అండగా నిలుద్దామని అన్నారు. ఏ ఒక్క నాయకుడికి కష్టం వచ్చినా.. బీఆర్ఎస్ నాయకులందరు ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పాలా వెంకటరెడ్డి, మందపాటి సునీత వెంకటరెడ్డి, మందపాటి శ్రీలక్ష్మి, గాయం సద్గుణవతి, పద్మ, రావూరి రమాదేవి, మూడు కుమారి, గరిగంటి మౌనిక, అర్వేపల్లి సుహాసిని, కొక్కెరగడ్డ రాజ్యలక్ష్మి, సుధాకర్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

బోనకల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. మండలంలోని చిరునోముల, బోనకల్ ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. క్లాస్ రూం లకు వెళ్లి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. పాఠశాలలో మౌళిక వసతులను పరిశీలించి ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

10 జీపీఏ సాధించాలి..

కల్లూరురూరల్: మండలంలోని చిన్నకోరుకొండి జెడ్పీ ఉన్నత పాఠశాల ఎస్సెస్సీ విద్యార్థులలో 10 జీపీఏ సాధించిన వారికి రూ.25వేలు నగదు బహుమతిగా అందించనున్నట్లు తోపుడుబండి ఫౌండేషన్ నిర్వాహకుడు షేక్ సాధిక్ అలీ ప్రకటించారు. గురువారం చిన్నకోరుకొండి హైస్కూల్‌లో పది చదువుతున్న 49 మంది విద్యార్థులకు రూ.15వేలు విలువైన ఆల్‌ఇన్‌వన్ గైడ్లను అందించడంతో పాటుగా స్టడీ అవర్స్‌లో అల్పాహారానికి రూ.10వేలు విరాళాన్ని అందించారు. పది అనంతరం బాసర ఐఐటీలో సీటు సాధించిన విద్యార్థులకు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పెల్ విజార్డ్‌లో విద్యార్థి సత్తా



యశ్వంత్‌ను అభినందిస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎం

మధిర: ఖమ్మంలోని రామభక్త కళాక్షేత్రంలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి స్పెల్ విజార్డ్‌లో టీవీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి మాగం యశ్వంత్ (9వ తరగతి) జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మధిర మండల విద్యాశాఖాధికారి వై.ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభాకర్ మాట్లాడారు. ఈ సందర్భంగా యశ్వంత్‌ను, స్పెల్ బి పోటీలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయిని ఎస్.అరుణ కుమారిని అభినందించారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

ముదిగొండ: పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకోసం టాలెంట్‌టెస్టులు చేపడుతున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ అన్నారు. ముదిగొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్ష పేపర్లను హెచ్‌ఎం కె.శాంతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, బ్రహ్మజీ, సత్యేంద్రబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, రాజు, వెంకట్, నవీన్, శ్రీచరణ్, ఆకాష్, దాస్, మధు, తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

చింతకాని: మండలంలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన నెల్లూరి ఆదినారాయణ పొలానికి ఉన్నటువంటి ఇనుప కంచె హద్దురాళ్లను ధ్వంసం చేసిన మార్కపూడి వెంకటేశ్వర్లుపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. తన పొలంలోకి అక్రమంగా ప్రవేశించి హద్దురాళ్లను ధ్వంసం చేశాడని ఆదినారాయణ చేసిన ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్ మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యతపై గురువారం డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ మల్లాది రజిత అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంక్ అకౌంట్స్, నామినేషన్ సౌకర్యం, రికరింగ్ డిపాజిట్స్, కేవైసీ తదితర అంశాలపై ఆమె వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు సారంగపాణి, పానెం రామచంద్రరావు, కృష్ణారావు, చెన్నారావు, రాంబాబు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి



పెనుబల్లి : వీయంబంజర్ రింగ్ సెంటర్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్షం నాయకులు

సత్తుపల్లిరూరల్/తల్లాడ/పెనుబల్లి: దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం అఖిల పక్షం ఆధ్వర్యంలో కరప్రతాలను పంపిణీ చేసి, బైక్ ర్యాలీ నిర్వహించారు. గురువారం సత్తుపల్లిలో మున్సిపల్ కార్మికులతో జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మటూరి రామకృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి యోబు మాట్లాడారు. అదే విధంగా తల్లాడలో కరపత్రాలు అందజేశారు. పెనుబల్లి మండలంలోని వీయంబంజర్‌లో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ భారతదేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెకు ప్రభుత్వ, ప్రైవేటు, వ్యాపార వర్గాల వారంతా మద్దతు తెలిపి విజయవంతం చేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రామలింగేశ్వర్‌రావు, శీలం సత్యనారాయణరెడ్డి, డి.శ్రీనివాస్, లాల్ సాహెబ్, మోహన్‌రావు, నాగేశ్వరరావు, వెంకటనరసయ్య, సీపీఎం నాయకులు విఠల్‌రావు, నరసింహారావు, తిరుపతిరావు, సీపీఐ నాయకుడు సుధాకర్, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకుడు లాజర్, పౌర హక్కుల సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, అరుణ్‌ప్రతాప్, సాయిశేషు, చిరంజీవి, సీతారాములు, రమేష్, రాములు, సీతారాములు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వైరారూరల్: 16న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ.. మండలంలోని తాటిపూడి గ్రామంలోని గోదాము వద్ద సీపీఎం నాయకులు కరప్రతాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నాగేశ్వరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ/చింతకాని/ఎర్రుపాలెం: నేడు నిర్వహించే సభను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు అరుణోదయ నాగన్న, సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు మల్లికార్జున్‌రావు, గోపాలరావు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్ తెలిపారు. ముదిగొండలో గురువారం ఉమాశంకర్ అధ్యక్షతన జరిగిన ముఖ్యకార్యకర్తలతో, చింతకానిలోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. ఎర్రుపాలెంలోని భీమవరం గ్రామంలో కమిటీ అధ్యక్షుడు దివ్వెల వీరాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన డీవైఎఫ్ఐ మండల కమిటీ సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, డివిజన్ కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, సుదర్శన్, రమేష్, రామస్వామి, నాగరాజు, ఉప్పలయ్య, శ్రీకాంత్, వెంకన్న, ఉమాశంకర్, అబ్దుల్‌రహీం, సీపీఎం నాయకులు జానికిరాములు, వెంకటనర్సయ్య, రవి, రాము, వీరబాబు, ఉపేందర్, రమణ, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.